ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
బాపట్ల జిల్లా వార్తలు
5
సోమవారం 1 సెప్టెంబరు 2025



బల్లికురవ : నక్కబొక్కలపాడులో గణేష్ నిమజ్జనంలో పాల్గొన్న మహిళా భక్తులు



చీరాల : పేరాల బాల గణేష్ విగ్రహ నిమజ్జనంలో పాల్గొన్న చిన్నారులు

కోలాహలంగా.. గణేష్ నిమజ్జనాలు

బల్లికురవ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన 40 గణేష్ విగ్రహాల నిమజ్జన వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నక్కబొక్కలపాడు గ్రామంలో మహిళా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. బల్లికురవలో నిమజ్జన వేడుకలలో భాగంగా చి న్నారులు వేసిన కోలాట ప్రదర్శన ఆకట్టుకొంది. కొప్పెరపాడు బొడ్డురాయి సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద లడ్డు వేలంలో అదే గ్రామానికి చెందిన యర్రా కోటేశ్వరరావు రూ.1.06 లక్షలకు పాడుకున్నారు. అనంతరం లడ్డుతో గ్రామోత్సవం నిర్వహించారు. అంబడిపూడి, రామాంజనేయపురం, గుంటుపల్లి, చెన్నుపల్లి, సూరేపల్లి గ్రామాలతో పాటు వీర్లకొండ వద్ద శ్రీశ్రీనివాస గ్రానైట్ క్వారీలో ఏర్పాటు చేసిన గణనాథులను ఊరేగించి ఏటీసీ కాల్వలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో పండుగ వాతావరణం నెలకొంది. పలు గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

బాపట్ల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం కలెక్టరేట్‌లో జరుగుతుందని కలెక్టర్ జె.వెంకటమురళి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో, మండలస్థాయిలోని రెవెన్యూ కార్యాలయాల్లో, రేపల్లె, బాపట్ల, చీరాల డివిజన్ కార్యాలయాల్లో కూడా జరుగుతుందన్నారు. వెబ్‌సైట్ నందు అర్జీలు నమోదు చేసుకోవటానికి మీకోసం.ఏపీ.జీవోవీ.ఇన్ లో నమోదు చేసుకోవచ్చు అన్నారు. అలాగే అర్జీల నమోదు, నమోదైన అర్జీలు, వాటి స్థితి తెలుసుకోవటానికి 1100కు నేరుగా కాల్ చేయవచ్చు అని కలెక్టర్ తెలిపారు.

ఆ చూద్దాంలే

ఈపీటీఎస్‌లో వెనుకబడిన బాపట్ల

సమీక్షించాలని కలెక్టర్లకు ప్రభుత్వ ఆదేశాలు

బాపట్ల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ పెర్‌ఫార్మెన్స్ ట్రాకింగ్ సిస్టమ్ (ఈపీటీఎస్)లో గుంటూరు జిల్లా రాష్ట్రంలోని మొదటి జిల్లాల్లో ఒకటిగా ఉండేందుకు ప్రయత్నిస్తుండగా బాపట్ల, పల్నాడు జిల్లాలు ఏమాత్రం పోటీ పడటం లేదు. దీంతో ప్రభుత్వం నుంచి ఆయా జిల్లాల అధికారులకు ఈపీటీఎస్ విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రభుత్వ జీవోలు మొదలు అన్ని రకాల డాక్యుమెంట్లు ఎప్పటికప్పుడు ఎలక్ట్రానిక్ పెర్‌ఫార్మెన్స్ ట్రాకింగ్ సిస్టమ్(ఈపీటీఎస్)లో అప్‌లోడింగ్ చేయాలి.. విధి నిర్వహణలో ఉద్యోగులకు ఈపీటీఎస్ ఎంతో ఉపయోగకరం. అయితే పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఆయా జీవోలు, డాక్యుమెంట్ల అప్‌లోడింగ్‌లో తాత్సారం నెలకొంది. తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో పల్నాడు జిల్లా 20, బాపట్ల జిల్లా 21వ స్థానంలో ఉన్నాయి. గుడ్ గవర్నెన్స్‌కు ఈపీటీఎస్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆలోచన చేసి దీనిని ప్రవేశపెట్టినా బాపట్ల జిల్లాలో మరీ తక్కువగా 5248 డాక్యుమెంట్స్‌ని ఈపీటీఎస్‌లో నిక్షిప్తం చేశారు. అదే పల్నాడు జిల్లాకు వచ్చేసరికి అన్ని కలిపి కూడా కేవలం 8598 డాక్యుమెంట్‌లు మాత్రమే అప్‌లోడింగ్ చేశారు. దీనివల్ల ఆయా జిల్లాల ఉద్యోగులు గుడ్ గవర్నెన్స్‌లో వెనుకబడిపోయే అవకాశం ఉన్నది. ఈ నేపథ్యంలో కలెక్టర్లు దృష్టి పెట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. గుంటూరు జిల్లాలో ఇప్పటివరకు 39,349 డాక్యుమెంట్లను అధికారులు ఈపీటీఎస్‌లో అప్‌లోడింగ్ చేశారు. వాటిల్లో జీవోలు 1369, మెమోలు 800, సర్క్యులర్లు 1291, నోటిఫికేషన్లు 125, లేఖలు 14975, చట్టాలు, నిబంధనలు, క్రమబద్ధీకరణలు 247, విధానపరమైన పత్రాలు 555, తీర్మానాలు 73, ఆడిట్ రిపోర్టులు 281, తీర్పులు 181, ప్రొసీడింగ్స్ 15838, ఇతరత్రా 3614 ఉన్నాయి.

వాన నీటిని పట్టేద్దాం

జిల్లాలో 8 గ్రామాలు గుర్తింపు

బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో గ్రామస్థాయిలో భూగర్భ జల మట్టాలపై ప్రభుత్వం సర్వే చేసింది. బాపట్ల జిల్లాలో భూగర్భ జలాల లభ్యత 3.88 మీటర్ల పరిధిలో నీటిమట్టం ఉన్నట్లు అధికారులు గుర్తించారు.జిల్లా పరిధిలోని 8 గ్రామాల్లో నీటి మట్టం పెంచాలని యంత్రాంగం తేల్చింది. అదేవిధంగా మరీ తీసికట్టుగా భూగర్భ జలాలు ఉన్న గ్రామాలను గుర్తించి తొలి దశలో భాగంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ప్రభుత్వం జిల్లా అధికారులను ఆదేశించింది.

- వర్షపు నీటి సంరక్షణకు చర్యలు
- భూగర్భ జల మట్టాల పెంపునకు చర్యలు
- చెరువులు, కుంటలు నింపడంపై కార్యాచరణ
- బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల్లో 2,500 పంట కుంటలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వానొస్తే వరద. చినుకు పడకపోతే చింత. ఇదీ జిల్లాలో పరిస్థితి. జిల్లా పరిధిలో కృష్ణానది పారుతున్నా అటు సాగు నీరు, ఇటు తాగునీటికి ఇబ్బందులు నెలకొం టున్నాయి. ఈ పరిస్థితుల్లో భవిష్యత్తు నీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండా లంటే వర్షపు నీటిని ఒడిసిపట్టి జాగ్రత్త చేసు కునే దిశగా ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభిం చింది. ఇష్టారీతిన ఇసుక తవ్వకాల వల్ల కూడా భూగర్భ జలమట్టాలలో తగ్గుదల నమోదవుతుం దని, దాని ఫలితమే కృష్ణానది పరీవాహక ప్రాం తాల్లో తీసికట్టుగా నీటిమట్టాలు నమోదవు తున్నట్లు అధికారులు గుర్తించి నివారణ చర్య లపై దృష్టి సారించారు. గ్రామాల వారీగా భూగర్భ జలాల లభ్యతపై క్షేత్రస్థాయిలో కచ్చితత్వంతో కూడిన పరిశీలనకు శ్రీకారం చుట్టింది. గుంటూరు జిల్లాలో 5 మీటర్లు, పల్నాడు జిల్లాలో ప్రమాదకరస్థాయిలో 10.50 మీటర్ల వరక భూగర్భ జలాల నీటి మట్టం ఉన్నట్లు సర్వేలో తేలింది. బాపట్ల జిల్లాలో భూ గర్భ జలాల లభ్యత 3.88 మీటర్ల పరిధిలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ పరిస్థి తుల్లో ఆయా జిల్లాల పరిధిలో మరీ తీసికట్టుగా భూగర్భ జలాలు ఉన్న గ్రామాలను గుర్తించి ఎక్కడికక్కడ ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వం జిల్లా అధికారులను ఆదేశించింది. భూగర్భ జలాల పెంపుపై



గత ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. కనీసం ఒక్క ఇంకుడుగుంత కూడా నిర్మించలేదు. ఈ పరిస్థితుల్లో మెట్ట ప్రాంత రైతులు సమృద్ధిగా నీటి లభ్యత లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ పరిస్థితి ఉండకూడదనే భూగర్భ జలాల పెంపుపై కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది.

సాగునీటి సంఘాలకూ భాగస్వామ్యం

ఆయకట్టు రైతుల ప్రయోజనాలు కాపాడడంతో పాటు కాల్వల నిర్వహణను సమర్థంగా నిర్వహిం చడానికి ప్రభుత్వం ఇటీవలే సాగునీటి సంఘాలను కొలువు దీర్చిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం వర్షపు నీటిని ఒడిసిపట్టడంతో పాటు, వృథాగా సముద్రంలో కలిసిపోయే నీటిని వివిధ మార్గాల ద్వారా సంరక్షించే దిశగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ఈ ప్రక్రియలో సాగునీటి సంఘాలకు భాగస్వామ్యం కల్పించనుంది. జలవనరులశాఖ, వ్యవసాయం, రెవెన్యూతో పాటు డ్వామా విభాగంతో సమన్వయం చేసుకుంటూ ప్రణాళికలు పక్కాగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యతను భూగర్భ జలవనరులశాఖకు ప్రభుత్వం అప్పగించింది. బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలో కొత్తగా దాదాపు 2,500 వరకు పంట కుంటలను తవ్వడంతో పాటు ఇంకుడు గుంతలు తవ్వడాన్ని కూడా యుద్ధప్రాతిపదికన చేపట్టేలా అధికారులు కార్యాచరణ రూపొందించి అడుగులు వేస్తున్నారు.

ఇప్పటికే కార్యాచరణ అమలు

జిల్లా పరిధిలోని అద్దంకి నియోజకవర్గ పరిధిలోని కొండల అంచుల వద్ద ఇంకుడుగుంతలు, నీటి, పంట కుంటలను విస్తృతంగా తవ్వించేలా ఇప్పటికే అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. ఉపాధి హామీ పథకం నిధులను ఆయా పనులకు అనుసంధానం చేశారు.

ఆచరణే కీలకం

ప్రభుత్వం భూగర్భ జలాల పెంపు అంశాన్ని మొక్కుబడితంతుగా కాకుండా ఫలితాలు కనబడేలా ఉండాలని ఆదే శించింది. ఇందులో భాగంగా తొలుత కాల్వల కింద ఉన్న చెరువులు, వాగు లు, కుంటలు నింపడం తొలి ప్రాధా న్యంగా ఎంచుకుంది. వర్షపునీరుతో పాటు వృథాగా వెళ్లే వరదనీటితో వీటి ని నింపేలా ప్రణాళికలు తయారు చేసుకోవాలని యంత్రాంగానికి మార్గ నిర్దేశం చేసింది. ఇదే అంశంపై వివిధ విభాగాల మధ్య సమన్వయం ఏర్పర చడంతో పాటు భవిష్యత్తులో సాగు, తాగునీటి అవసరాలకు ఎలాంటి ఇ బ్బందులు రాకూడదని నిర్దేశించింది. ముందుగా చెరువులు, పంట కాల్వల కట్టలను బలోపేతం చేయడంపై యంత్రాంగం దృష్టి సారించింది.

బీచ్ ఫెస్టివల్‌పై ఎమ్మెల్యే సమీక్ష

చీరాల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తీరంలో నిర్వహించనున్న బీచ్ ఫెస్టివల్‌పై ఎమ్మెల్యే కొండయ్య ఆదివారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 26 - 28 వరకు వేడుకలు జరిపించేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధమయ్యాయి. సూర్యలంక, వాడరేవు, రామాపురం ప్రాంతాలను అధికారులు పరిశీలించారు. ఈ క్రమంలో ఆదివారం చీరాల ఎమ్మెల్యే కొండయ్యతో అధికారులు చర్చించారు. సుమారు ఎంతమంది పర్యాటకులు హాజరవుతారు.. ఏ విధమైన కార్యక్రమాలు నిర్వహిస్తే బాగుంటుందనే అంశాలపై ఎమ్మెల్యేతో అధికారులు చర్చించారు. అలాగే తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు అధికారుల విధివిధానాలపై సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో జేసీ గంగాధర్‌గౌడ్, టూరిజం అధికారి నాగిరెడ్డి, ఏడీ మైనింగ్ రామచంద్రరావు, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.



బీచ్ ఫెస్టివల్‌పై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

పుట్ట గొడుగులు.. రూ.400



అద్దంకిలోని భవానిసెంటర్‌లో పుట్టగొడుగులు అమ్ముతున్న మహిళలు

అద్దంకి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సహజ సిద్ధ పుట్టగొడుగులకు డిమాండ్ అధికం. ఆహారప్రియులు ఈ పుట్టగొడుగుల కొనుగోలుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. మూడు రోజులుగా అద్దంకిలోని భవానిసెంటర్‌లో పుట్టుగొడుగుల అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి. 10 నుంచి 15 పుట్టగొడుగులు ఉండే కట్ట రూ.300 నుంచి రూ.400 వరకు విక్రయిస్తున్నారు. నలుగురైదుగురు సభ్యులు ఉండే కుటుంబానికి ఒక పూట పుట్టగొడుగులు కూర తినాలంటే కనీసం రూ.2 వేల వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

6

రాష్ట్ర స్థాయి క్యారమ్స్‌లో వైజాగ్ క్రీడాకారుల సత్తా

- పురుషుల, మహిళల విభాగంలో ప్రథమ బహుమతులు

ఇద్దరు యువకుల గల్లంతు

- రక్షించిన మెరైన్, పోలీసు సిబ్బంది

పని కోసం వెళ్ళి ప్రాణాలు కోల్పోయాడు

బాపట్లకు చేరిన తమిళనాడులో ఏనుగుల దాడికి గురైన యువకుడి మృతదేహం

దివ్యాంగులకు ఊరట

- యథావిధిగానే పింఛన్ల పంపిణీ
- రద్దు చేసిన 10,279 బాధితులకు తీపికబురు
- అప్పీలు చేసుకున్నా.. చేసుకోకున్నా కొనసాగింపు

దివ్యాంగుల పింఛన్‌దారుల్లో అనర్హుల ఏరివేతకు ప్రభుత్వం ప్రయత్నించగా అధికారుల నిర్లక్ష్యం అర్హుల పాలిట శాపంలా మారింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో 10,279 మంది దివ్యాంగులను అనర్హులుగా అధికారులు గుర్తించారు. దీంతో వీరికి సెప్టెంబరు నుంచి పింఛన్ రద్దు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో తమకు పింఛన్ అందదని దివ్యాంగులు ఆందోళనలో ఉన్నారు. అయితే అనర్హుల కంటే అత్యధికంగా అర్హులు పింఛన్ల రద్దు అయిన జాబితాలో ఉన్నారని ప్రభుత్వం గుర్తించింది. దీంతో తమ అర్హతను నిరూపించుకునే అవకాశం ఇవ్వడంతో పాటు యథావిధిగా పింఛన్లను పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించింది. దీంతో పింఛన్‌దారుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి.



గుంటూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పింఛన్ల తొలగింపు విషయంలో ప్రభుత్వం ఒక అడుగు వెనక్కివేసింది. అనర్హతబారిన పడిన వారికి తిరిగి అప్పీలు చేసుకునేందుకు గడువు ఉన్న నేపథ్యంలో సెప్టెంబరులో ఇచ్చే పింఛను పాత పద్ధతిలోనే ఇచ్చేందుకు సిద్ధమైంది. దీంతో అనర్హతబారిన పడిన దివ్యాంగులకు ఈ నెల ఊరట లభిం చింది. గత వైసీపీ ప్రభుత్వంలో దివ్యాంగుల పింఛన్ల జాబితా లో అనేకమంది అనర్హులు అక్రమంగా చొరపడ్డారు. వారిని వడపోయగా గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 10,279 మంది అనర్హులని తేలింది. మరికొంత మంది వైకల్య శాతం తక్కువగా నమోదు కావడంతో వారిని రూ.15 వేల నుంచి 6 వేల పింఛను జాబితాలో వేసింది. మరికొందరు అనర్హులైన (మిగతా 6లో)

పాత జాబితా ప్రకారమే పంపిణీ



పాత జాబితా ప్రకారమే సెప్టెంబరులో పింఛను అందజేస్తాం. పింఛన్లు రద్దయిన వారికి కూడా ఈ నెల పింఛన్లు ఇస్తున్నాం. అప్పీలు చేసుకునేందుకు గడువు ఉండడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పాత జాబితా ప్రకారం ఎంతయితే పింఛను వచ్చిందో.. ఈ నెల కూడా అంతే పింఛను వస్తుంది. ఆందోళన పడవద్దు.

-విజయలక్ష్మి, పీడీ, డీఆర్డీఏ గుంటూరు

చేతి మగ్గం.. అచేతనం

ఉత్పత్తులకు తగ్గిన డిమాండు

మార్టూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): దేశ స్థాయిలో గుర్తింపు పొందిన కుప్పడం చీరలను నేసే కార్మికులు వలపర్లలో అత్యధికంగా ఉన్నారు. సాదా రకాలు, కంచిబోర్డరు, డాబి రకాల ఉత్పత్తులను చేతిమగ్గాలపై కార్మికులు నేస్తుంటారు. అయితే పవర్‌లూమ్ ద్వారా తయారైన చీరలు మార్కెట్‌లో రాజ్యమేలుతుండటంతో చేతి మగ్గాల ద్వారా చీరలను తయారుచేయించడానికి మాస్టర్ వీవర్లు ఆసక్తి చూపడంలేదు. దాంతో చేతి మగ్గాల కార్మికులకు పనిలేకుండా పోయింది. ఒక వేళ చేతి మగ్గాలపై చీరలను తయారు చేయించినా కూలి గిట్టుబాటు కావడం లేదు. ఉదాహరణకు వలపర్లలో కుప్పడం చీర తయారీకి చేతిమగ్గందారుడికి 15 ఏళ్లుగా రూ.వెయ్యి కూలి ఇస్తున్నారు. ఈ కూలి గిట్టుబాటు కావడంలేదని కార్మికులు చెబుతున్నారు. అదే పవర్ లూమ్ ద్వారా 600 కూలికే కుప్పడం చీర తయారుకావడం విశేషం. వలపర్ల, కోనంకి గ్రామాలలో దాదాపుగా ముప్పావువంతు చేతి మగ్గాలు ఆగిపోయాయి. దాంతో చేనేత కుటుంబాలకు చెందిన పురుషులు బేల్దారి, పెయింట్ పనులకు, గ్రానైట్ పరిశ్రమలలో కార్మికులుగా వెళ్తున్నారు. చేతి మగ్గాలపై తయారైన ఉత్పత్తులకు కొనుగోళ్లు పెరిగితే, మాస్టర్ వీవర్స్ తమకు నేయడానికి చీరలు ఇస్తారని చేతి మగ్గాల కార్మికులు అంటున్నారు.



చేతి మగ్గం ద్వారా తయారయిన చీర



కుప్పడం మగ్గంపై చీరను నేస్తున్న చేనేత కార్మికురాలు



రూ.25 వేలతో ఆనందం : గంజి శ్రీనివాసరావు వలపర్ల

ఏడాదికి మగ్గందారుడికి రూ.25 వేలు ప్రకటించడం ఆనందంగా ఉంది. మూలనపడిన చేతి మగ్గాలు పనిచేసే దిశగా కార్మికులు పనిచేస్తారు. చేతి మగ్గాలపై తయారయ్యే ఉత్పత్తులకు మార్కెట్లో గిట్టుబాటు ధర కల్పించాలి. వాటి తయారీకి వినియోగించే నూలు,రసాయనాల ధరలను తగ్గించాలి.



గిట్టుబాటు కాని కూలి : గుంటి ఆదినారాయణ వలపర్ల

15 ఏళ్ల క్రితం కుప్పడం చీరను నేస్తే రూ.వెయ్యి కూలి ఇచ్చారు. ఇపుడు కూడా అదే చీరను నేస్తే అంతే కూలి ఇస్తున్నారు. కుటుంబాలు ఎలా బతకాలి. చేతి మగ్గాలపై నేసే వస్త్రాలకు డిమాండు పెరిగేదెప్పుడు. మాకు కూలి పెరిగేదెప్పుడు.

రాష్ట్ర స్థాయి క్యారమ్స్‌లో వైజాగ్ క్రీడాకారుల సత్తా

● పురుషుల, మహిళల విభాగంలో ప్రథమ బహుమతులు

చిలకలూరిపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీఆర్ క్లబ్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్యారమ్స్ పోటీలలో వైజాగ్ క్రీడాకారులు సత్తా చాటారు. పురుషులకు, మహిళలకు వేరు వేరుగా నాకౌట్ పద్ధతిలో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో పురుషుల, మహిళల విభాగాల్లో విశాఖపట్టణానికే చెందిన సిహెచ్. జనార్ధన్‌రెడ్డి, ఎ. భవాని ప్రథమ బహుమతులు అందుకున్నారు. పురుషుల విభాగంలో ఎస్ వెంకయ్య (నెల్లూరు) ద్వితీయ బహుమతి పొందగా, జి. జయకుమార్ (గుంటూరు) తృతీయ, బి. పవనకుమార్ (అనంతపురం) నాలుగో బహుమతిని అందుకున్నారు.



పురుషుల విభాగంలో ప్రథమ బహుమతి అందుకుంటున్న సీహెచ్ జనార్ధనరెడ్డి (వైజాగ్)

మహిళల విభాగంలో ఎల్ హరిప్రియ (విశాఖపట్నం) ద్వితీయ, డాక్టర్ ఎంఎస్‌కే హారిక (విశాఖపట్నం) తృతీయ, ఎస్‌కే హుస్నా సమీరా (విశాఖపట్నం) నాలుగో బహుమతిని అందుకున్నారు. ఆదివారం ముగింపు సభలో విజేతలకు సీఆర్ క్లబ్ ఉపాధ్యక్షుడు చెరుకూరి కాంతయ్య, కార్యదర్శి పావులూరి శ్రీనివాసరావు, కోశాధికారి మక్కెన నరసింహారావు బహుమతి ప్రదానం చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన 170 మంది క్రీడాకారులు పోటీలలో పాల్గొన్నారు. రాష్ట్ర క్యారమ్ సంఘం ప్రధానకార్యదర్శి షేక్ అబ్దుక్ జలీల్, టోర్నమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్ వి రమణమూర్తి, అబ్జర్వర్ గద్దె వేణు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మాల్దీవులు వెళ్లడానికి రూ.లక్ష ఆర్థిక సహాయం

రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీలలో ప్రథమ స్థానంలో గెలుపొందిన జనార్ధన్ రెడ్డికి క్యారమ్ ప్రపంచ కప్ పోటీలలో పాల్గొనేందుకు మాల్దీవులు వెళ్ళడానికి రూ. లక్ష ఆర్థిక సహాయాన్ని సీఆర్ క్లబ్ తరపున క్లబ్ కార్యదర్శి పావులూరి శ్రీనివాసరావు అందచేశారు.

దివ్యాంగులకు ఊరట

(5వ పేజీ తరువాయి)

వయోవృద్ధులను సాధారణ పింఛను జాబితాలో వేసింది. అయితే ఈ జాబితాలో అనర్హులతోపాటు కొందరు అర్హులు కూడా పింఛను కోల్పోయారు. ఈ నేపథ్యంలో దివ్యాంగుల్లో కలవరం మొదలైంది. అధికారుల వద్దకు పరుగులు పెట్టారు. దీంతో ప్రభుత్వం వారికి తిరిగి అప్పీలు చేసుకునే అవకాశం కల్పించింది. వారి వైకల్య స్థాయిని పునః పరిశీలించేందుకు మరోమారు అప్పీలు చేసుకునే సదుపాయం కల్పించింది. దీంతో పెద్దసంఖ్యలో అభ్యర్థనలు వచ్చాయి. అప్పీలు చేసుకునేందుకు గడువు కూడా ఉండడంతో పాత పద్ధతిలోనే పింఛను ఇచ్చేందుకు నిర్ణయించింది. బాధితులు అప్పీలు చేసుకున్నా, చేసుకోకున్నా వారికి యథావిధిగా పింఛన్లను కొనసాగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పింఛన్లు తొలగిస్తూ విడుదల చేసిన కొత్త జాబితాపై ఆందోళనలు వెల్లువెత్తడంతో పాత జాబితా మేరకే పింఛన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు పాత జాబితాను తిరిగి విడుదల చేయడంతోపాటు, ఆ జాబితాకు అను గుణంగా నగదును బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. గతంలో మాదిరిగానే లబ్ధిదారులు రూ.15 వేలు, రూ.6వేలు చొప్పున పింఛన్లు అందుకోనున్నారు. ఇస్తున్నారు. తాజాగా పేర్లు తొలగించిన 10,279 మందికి కూడా అదే పద్ధతిలో పింఛన్లు అందించాలని ఆయా జిల్లా అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.



సాగర్‌కు కొనసాగుతున్న వరద ఉధృతి

విజయపురిసౌత్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి వరద ప్రవాహం కొనసాగుతుండడంతో ఆదివారం ప్రాజెక్ట్ అధికారులు 26 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు. సాగర్ జలాశయం నీటిమట్టం 586.70 అడుగులు ఉంది. ఇది 303.94 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,019 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఎడమ కాలువ ద్వారా 5,156 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,130 క్యూసెక్కులన విడుదల చేస్తుండగా 22 క్రస్ట్‌గేట్లను 5 అడుగులు, 4 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 2,56,746 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1200, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు మొత్తంగా 3,05,551 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లోగా 3,41,558 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పశ్చిమడెల్టాకు 6500 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకు 6500 క్యూసెక్కునీరు ఆదివారం విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 12 అడుగుల నీటిమట్టం ఉండగా దిగువకు 2,33,975 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 216 క్యూసెక్కులు, రేపల్లె కాల్వకు 1486 క్యూసెక్కులు, తూర్పుకాల్వకు 452 క్యూసెక్కులు, పశ్చిమకాల్వకు 208 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 413 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 2380 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

టెయిల్‌పాండ్ నుంచి 2,32,037 క్యూసెక్కుల నీటి విడుదల


రెంటచింతల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణా నదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ ప్రాజెక్టు నుంచి పులిచింతల లకు 2,32,037 క్యూసెక్కుల నీటి విడుదల చేసినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు తెలిపారు. ప్రాజెక్టు 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 9 గేట్లను 3 మీటర్ల మేర, 8 గేట్లను 2.5 మీటర్ల మేర ఎత్తి నీటిని విడుదల చేసినట్లు చెప్పారు. ఎగువన వున్న సాగర్ నుంచి 2,35,057 నీరు ప్రాజెక్టుకు వచ్చి చేరుతోందని, ప్రస్తుతం రిజర్వాయర్‌లో 74.60 మీటర్ల మేర నీరుండగా ఇది 6.625 టీఎంసీలకు సమానమని తెలిపారు. విద్యుదుత్పత్తిని నిలిపి వేసినట్లు వారు చెప్పారు.


టెయిల్‌పాండ్ నుంచి 17 క్రస్ట్ గేట్ల స్పిల్‌వే ద్వారా జాలువారుతున్న కృష్ణమ్మ

ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు వరద నీరు

2,10,700 క్యూసెక్కులు విడుదల

తాడేపల్లి టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేయడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుతో పాటు కీసర, మున్నేరు, వెలగలేరు, తదితర ప్రధాన వాగుల నుంచి ఆదివారం 2లక్షల 25 వేల 641 క్యూసెక్కుల వరదనీరు ఇన్‌ఫ్లోగా నమోదయినట్లు ఇరిగేషన్‌శాఖ జేఈ రాజేశ్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుం డగా దిగువకు 2 లక్షల 10 వేల 700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు. అలాగే తూర్పు డెల్టా కాలువకు 8 వేల 419 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 6 వేల 522 క్యూసెక్కులు వదులుతున్నామని, గుంటూరు ఛానల్‌కు నీటి విడుదలను నిలిపివేశామని జేఈ రాజేశ్ తెలిపారు.


ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు విడుదలవుతున్న కృష్ణానది వరదనీరు

మహిళా సభల విజయవంతంలో యరపతినేని భేష్

● నాడు పసుపు కుంకుమ, సీమంతాలతో శ్రీకారం ● నేడు స్త్రీ శక్తి మహాసభ



పిడుగురాళ్ల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గురజాల నియోజకవర్గంలో మహిళామణులకు పెద్దపీట వేయటంలో యరపతినేని శ్రీనివాసరావు ఎప్పుడూ ముందుంటారు. మహిళలకు అన్నింటా ప్రాధాన్యం కల్పిస్తూ వారికి సముచిత స్థానం కల్పిస్తుంటారు. పార్టీ, తాను అధికారంలో ఉన్నా లేకున్నా మహిళలకు ఏ చిన్న ఆపద వచ్చినా వారిని తమ కుటుంబసభ్యులుగా భావించి నేనున్నానంటూ ఆదుకుంటారు. నియోజకవర్గంలోని మహిళలను తోబుట్టువులుగా తలచి 2014-19 మధ్యకాలంలో పసుపు కుంకుమ, సీమంతం, షష్ఠిపూర్తి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గురజాల నియోజకవర్గం వ్యాప్తంగా సుమారు 30 వేల మంది మహిళలకు పసుపు కుంకుమ, 7 వేల మందికి షష్ఠిపూర్తి, మరో 7 వేల మందికి సీమంతం కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే తంగెడలోని 2 వేల మంది ముస్లిం మైనారిటీ అక్కాచెల్లెళ్లకు పసుపు కుంకుమ, సీమంతం కార్యక్రమంతో పాటు దళితతేజంతో దళిత కాలనీలకు వెళ్లి నూతన వస్త్రాలను అందజేసి వేలాది మంది మనసుల్లో ఓ అన్నగా స్థానం సంపాదించుకున్నారు. ఆనాడు చేపట్టిన పసుపు కుంకుమ, సీమంతం, షష్ఠిపూర్తి కార్యక్రమాల వల్లే 2024 ఎన్నికలలో ఆయనకు అత్యధిక మెజారిటీ దక్కింది.

నేడు మహిళా మణులతో భారీ బహిరంగసభ

ఆనాడు వేలాది మందికి ఓ అన్నగా తోడుంటూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు పెద్దదిక్కుగా మారిన ఎమ్మెల్యే యరపతినేని నేడు పిడుగురాళ్లలో 30 వేల మంది మహిళామణులతో స్త్రీ శక్తి పథకం విజయోత్సవ సభను జరపనున్నారు. పల్నాడు ప్రాంతంలో ఇప్పటి వరకు జరిగిన సభలకు భిన్నంగా అత్యధికంగా వేలాది సంఖ్యలో ప్రత్యేకంగా మహిళలతోనే ఈ సభ జరగనుంది. సభను విజయవంతం చేసేందుకు నియోజకవర్గం వ్యాప్తంగా అన్ని పట్టణ, గ్రామాల నుంచి వేలాది సంఖ్యలో మహిళా మణులు ఈ సభకు తరలిరానున్నారు.

నాడు యరపతినేని పథకాలపై పార్టీలో చర్చ

2014-19 మధ్యకాలంలో ఎమ్మెల్యే యరపతినేని గురజాల నియోజకవర్గంలో మహిళల కోసం ప్రత్యేకంగా చేపట్టిన పసుపు కుంకుమ కార్యక్రమాలపై ఆనాడు టీడీపీ రాష్ట్ర పార్టీలో చర్చ జరిగింది. పసుపు కుంకుమ పథకం గురించి మీడియా ద్వారా, స్వయంగా సభకు హాజరైన నేతల ద్వారా తెలుసుకున్న చంద్రబాబు తర్వాత ప్రభుత్వ పథకంగా దాన్ని ప్రవేశపెట్టి మహిళలకు ఆర్థికంగా చేయూతనిచ్చారు.

నాగార్జున కొండపై పర్యాటకుల సందడి

● లాంచీ స్టేషన్ ఆదాయం రూ. 1,27,450


నాగార్జున కొండను సందర్శించి వస్తున్న పర్యాటకులు

విజయపురిసౌత్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండపై పర్యాటకుల సందడి నెలకొంది. ప్రాజెక్టు 26 గేట్ల ద్వారా నీరు విడుదల కావడం అలాగే ఆదివారం కావడంతో కొండపైకి పర్యాటకులు పోటెత్తారు. స్థానిక లాంచీ స్టేషన్ నుంచి నాగార్జున కొండకు శాంతిసిరి, నాగసిరి, అగస్త్యా లాంచీలలో చేరుకుని కొండపై గల మ్యూజియంలోని బుద్ధుని ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టికుండలు, 9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహాన్ని సందర్శించారు. అనంతరం అనుపులోని అశ్వమేధ యజ్ఞశాల, శ్రీచేత్యము, యాంపి థియేటర్, శ్రీరంగనాథస్వామి ఆలయాన్ని వీక్షించారు. అనంతరం 60 అడుగులు ఎత్తు నుంచి జాలువారుతున్న ఎత్తిపోతల జలపాతం అందాలను తిలకించి మైమరచిపోయారు. లాంచీల ద్వారా రూ. 1,27,450 ఆదాయం పర్యాటక శాఖకు సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.

మహిళా సాధికారతే సీఎం చంద్రబాబు లక్ష్యం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీలు, మహిళా సాధికారతే సీఎం చంద్రబాబునాయుడి లక్ష్యాలని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ హామీలు అమలు చేసి ధైర్యంగా ప్రజల్లోకి వస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో ఏ మహిళను కదిలించినా సంతోషం కనిపిస్తుందని, ఉచిత బస్సు ప్రయాణంపై వారు చాలా ఆనందంగా ఉన్నారని అన్నారు. మహిళల విద్యాభివృద్ధికి 2004లోనే సైకిళ్ళు పంపిణీ చేసిన ఘనత చంద్రబాబుదని, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంలో ఆయన చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. తల్లికి వందనం ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి రూ. 15వేలు ఇస్తూ బాలికల విద్యకు ప్రభుత్వం అండగా నిలిచిందని, ఎన్టీఆర్ భరోసాను ఒకేసారి రూ. వెయ్యి పెంచి రూ. 4 వేలు పెన్షన్ ఇస్తున్నామన్నారు. దీపం పథకం కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు సిలిండర్లు, అన్నదాత సుఖీభవ మొదటి విడతగా రూ. 7 వేలు ఇచ్చామని చెప్పారు. మెగా డీఎస్సీ ద్వారా 16,347 పోస్టులు ఇచ్చామని, మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేకంగా ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీల ద్వారా రూ. 20 లక్షల వరకు రుణాలు, అందులో రూ. 10 లక్షల వరకు వడ్డీ రాయితీ కల్పిస్తున్నామని చెప్పారు. మహిళా సాధికారత, స్వావలంబనకు టీడీపీ ప్రాధాన్యం ఇస్తుందని, మహిళలకు అవకాశం ఇస్తే అద్భుతాలు చేస్తారని, అదే నమ్మకంతో సీఎం చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నారని కొమ్మాలపాటి శ్రీధర్ పేర్కొన్నారు.

ఎద్దుల బండలాగుడు పోటీలకు ప్రభుత్వం చేయూత

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు


ప్రథమ స్థానంలో నిలిచిన పల్నాడు జిల్లా ఎద్దు

ప్రత్తిపాడు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఎద్దుల బండలాగుడు పోటీలకు ప్రభుత్వం చేయూత అవసరమని, ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి దృష్టికి తీసుకెళతానని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ప్రత్తిపాడులో మూడో రోజు జరుగుతున్న నందమూరి తారాకరామారావు మెమోరియల్ ఒంగోలు జాతి ఎద్దుల బండలాగుడు పోటీలను ఆయన తిలకించారు. ఈ సందర్భంగా పోటీలలో తలపడుతున్న పశుపోషకులకు మెమెంటోలు అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఎద్దుల బండలాగుడు పోటీలను రాష్ట్రంలో తిరిగి ప్రారంభించిన ఘనత చంద్రబాబుదేనని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం పశుపోషణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. ఎద్దులను మేపడం ఎంతో ఖర్చుతో కూడుకున్న పని అని, అయినా రైతులు వ్యయప్రయాసలతో వాటిని మేపుతున్నారని కొని యాడారు. అలాంటి రైతులకు ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందన్నారు. జగన్ వెళుతూ ఖాళీ డబ్బాను ఇచ్చి వెళ్లాడని త్వరలోనే ప్రభుత్వం ద్వారా ఇలాంటి పందేల నిర్వహణకు చేయూత అందించే విధంగా ప్రయత్నం చేస్తామని ప్రత్తిపాటి పుల్లారావు హామీ ఇచ్చారు. రాష్ట్ర తెలుగు రైతు మీడియా కో-ఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట మార్కెట్ యార్డు చైర్మన్ కరిముల్లా, నెల్లూరు సదాశివరావు, జవ్వాజి మదన్‌మోహన్, కుర్రి సుబ్బారెడ్డి, కాకాని సురేష్, పమిడి శ్రీనివాసరావు, మాకినేని జగన్, నువ్వుల సునీల్ చౌదరి, మామిళ్లపల్లి రామ్ గోపాల్, నక్కల అగస్టియన్, నల్లమోతు పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

ఆరుపళ్ల విభాగంలో సత్తాచాటిన పల్నాడు జిల్లా ఎడ్లు

ఆరుపళ్ల విభాగంలో జరిగిన పోటీలలో పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం, కేశానపల్లి గ్రామానికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎద్దుల జత 3,717 అడుగుల దూరం బండను లాగి ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే నంద్యాల జిల్లా పాణ్యం మండలం, కొత్తూరుకు చెందిన బీఆర్‌కే రెడ్డి, గుంటూరు జిల్లా మంగళగిరి మండలం, నవులూరుకు చెందిన బత్తుల శ్రీనివాసరావుకు చెందిన ఎద్దుల జత 3,600 అడుగుల దూరం బండను లాగి ద్వితీయ స్థానంలో, బాపట్ల జిల్లా జే పంగులూరుకు చెందిన గొట్టిపాటి రవి కుమార్ యూత్, పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేశానుపల్లి గ్రామానికి చెందిన కావ్యానంది బ్రీడింగ్‌బుల్స్ సెంటర్‌కు చెందిన ఎద్దుల జత 3,309 అడుగుల దూరం లాగి మూడవ స్థానంలో నిలిచింది. కృష్ణా జిల్లా పెనుమలూరు మండలం యనమలకుదురుకు చెందిన అనంతనేని శ్రీ కావ్య శ్రీమధు ఎద్దుల జత 3,300 అడుగుల దూరం బండను లాగి నాలుగో స్థానంలో, నంద్యాల జిల్లా ఎస్ కొత్తూరుకు చెందిన బీఆర్‌కే రెడ్డి, కేధార్ శర్వానందరెడ్డిలకు చెందిన ఎద్దుల జత 3,243.6 అడుగుల దూరం బండను లాగి ఐదవ స్థానంలో, బాపట్ల జిల్లా యద్దనపూడికి చెందిన ఎంకేఎం ఎద్దుల జత 3,058.2 అడుగుల దూరం బండను లాగి ఆరో స్థానంలో, ఎన్‌టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం తుర్లపాడుకు చెందిన దర్శి సాత్విక్, జశ్వంత్ సింహాకు చెందిన ఎద్దుల జత 2,712.10 అడుగుల దూరం బండను లాగి ఏడో స్థానంలో, గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నవులూరుకు చెందిన బత్తుల శ్రీనివాసరావుకు చెందిన ఎద్దుల జత 2,556 అడుగుల దూరం బండను లాగి 8వ స్థానంలో నిలిచాయి. గెలిచిన ఎద్దుల యజమానులకు కమిటీ సభ్యులు నగదు బహుమతులను అందజేశారు.

15 మంది జూదరుల అరెస్టు


పోలీసుల అదుపులో జూదరులు

సత్తెనపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై పట్టణ సీఐ నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేసి 15 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 2,45,670 నగదును స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని మన్నెం రెసిడెన్సీలో శనివారం కొందరు పేకాట శిబిరం నిర్వహిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు సీఐ నాగమల్లేశ్వరరావు, ఎస్ఐ పవన్ కుమార్ తమ సిబ్బందితో కలిసి అకస్మాత్తుగా దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న 15 మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ 2,45,670 నగదును, 21 సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ పట్టణ పరిధిలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు.

నెమలిపురి, రొంపిచర్ల మీదుగా రెండు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నెమలిపురి, రొంపిచర్ల మీదుగా తిరుపతి, చర్లపల్లికి రెండు ప్రత్యేక రైళ్లను సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు నెలల్లో నడపాలని రైల్వేశాఖ నిర్ణయించింది. చర్లపల్లి - తిరుపతి (07013) ప్రత్యేక రైలు సెప్టెంబరు 9వ తేదీ నుంచి నవంబరు 25వ తేదీ వరకు ప్రతి మంగళవారం నడవనుండగా, తిరుపతి - చర్లపల్లి (07014) ప్రత్యేక రైలు సెప్టెంబరు 10వ తేదీ నుంచి నవంబరు 26వ తేదీ వరకు ప్రతి బుధవారం నడవనుంది.

ఇద్దరు యువకులు గల్లంతు

● రక్షించిన మెరైన్, పోలీసు సిబ్బంది


సముద్రంలో గల్లంతయిన వారిని బయటకు తీసుకొస్తున్న మెరైన్ సిబ్బంది, గజఈతగాళ్ళు

బాపట్ల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సూర్యలంక సముద్రతీరంలో హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు యువకులు అలల తాకిడికి గల్లంతయ్యారు. సముద్రంలో కొట్టుకుపోతున్న వారిని మెరైన్ సిబ్బంది, రూరల్ పోలీసులు, గజఈతగాళ్ళు సమయస్ఫూర్తితో వ్యవహరించి రక్షించారు. మెరైన్ సీఐ టి.లక్ష్మారెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్న షేక్.సమీర్, షేక్.అదిల్ స్నేహితులతో కలిసి ఆదివారం సూర్యలంక సముద్రతీరానికి వచ్చారు. సముద్రస్నానం చేస్తుండగా అలల ధాటికి లోతుకు వెళ్ళిపోయి ప్రమాదంలో చిక్కుకున్నారు. గమనించిన సూర్యలంక కోస్టల్ సెక్యూరిటీ, పోలీసు సిబ్బంది కె.వెంకటేశ్వర్లు, ఎం.పోతురాజు, రూరల్ పోలీసు విక్టర్ గజఈతగాళ్ళతో వెళ్ళి వెంటనే వారిని బయటకు తీసుకొచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం బాపట్ల ఏరియావైద్యశాలకు పంపామని లక్ష్మారెడ్డి తెలిపారు. సిబ్బంది సకాలంలో స్పందించటం వల్లే ఇద్దరు యువకులు ప్రాణాలతో బటయపడ్డారని ఆయన పేర్కొన్నారు.

పని కోసం వెళ్ళి ప్రాణాలు కోల్పోయాడు

● బాపట్లకు చేరిన తమిళనాడులో ఏనుగుల దాడికి గురైన యువకుడి మృతదేహం


పేర్లి సుకుందరావు (ఫైల్‌ఫొటో)

బాపట్ల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఏనుగుల దాడిలో మృతిచెందిన యువకుడి మృతదేహం ఆదివారం బాపట్లకు చేరుకుంది. పనికోసం పరాయి రాష్ట్రం వెళ్లిన యువకుడు అక్కడ ఏనుగుల దాడిలో మృతి చెందడంతో పట్టణంలో విషాద ఛాయలు అలుము కున్నాయి. పట్టణంలోని జగన్నాథపురానికి చెందిన పేర్లి సుకుందరావు వరఫ్ బుజ్జి (35) తమిళనాడు రాష్ట్రం బంజూరులోని కొండప్రాంతంలోగల ప్లజంట్ వ్యాలి ఎస్టేట్‌లో మేనేజర్‌గా పనిచేసేందుకు వెళ్ళాడు. అక్కడ పండించే పంటలను చూసుకుంటూ రిసార్ట్‌లో ఉండేవాడు. శుక్రవారం ఏనుగులు రావటంతో వాటి నుంచి తనను తాను కాపాడుకునే ప్రయత్నంలో జారిపడ్డాడు. ఓ ఏనుగు అతడిపై దాడి చేయడంతో అక్కడికక్కడే బుజ్జి మృతి చెందాడు. ఫారెస్ట్ అధికారులు, పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి శనివారం కుటుంబసభ్యులకు అప్పగించారు. ఆదివారం భౌతికకాయాన్ని బాపట్లకు తీసుకొచ్చారు. మృతుడికి వివాహం కాలేదు. కాగా, జీవనోపాధి కోసం వెళ్ళి జీవితాన్నే కోల్పోయాడంటూ తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్థులు బుజ్జి భౌతికకాయం వద్ద బోరున విలపించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	111, 119, 130
చికెన్ విత్ స్కిన్(కిలో)	210.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	220.00

వైభవంగా గణేష్ నిమజ్జన ఉత్సవాలు



వేమూరు: జంపని సిద్ధి వినాయక ఆలయ నిమజ్జన గ్రామోత్సవం



కర్లపాలెం మండలం పెదపులుగువారిపాలెంలో లడ్డు వేలంపాటలో పాల్గొన్న భక్తులు

వేమూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధి గ్రామాల్లో ప్రారంభించిన గణపతి ఉత్సవాల్లో బాగంగా అన్నదానాలు నిర్వహించి విగ్రహాలను గ్రామాల్లో వైభవంగా ఊరేగించారు. మేళ తాళాలు బాణాసంచా నడుమ గణపతికి జేజేలు కొడుతూ కొల్లూరు మండలంలోని గాజుల్లంక కృష్ణానది పాయల వద్ద విగ్రహాలను నిమజ్జనం చేశారు.

● భట్టిప్రోలు మండల పరిధిలోని పలు గ్రామాల్లో విగ్రహాలను ప్రత్యేక వాహనాల్లో ప్రతిష్ఠించి కనక తప్పెట్లు, డీజే సౌండ్లతో గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. వెల్లటూరు ఛానల్‌లో స్వామి వారి ప్రతిమలను నిమజ్జనం చేశారు.

వినాయక లడ్డు వేలం

కర్లపాలెం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కర్లపాలెంలోని శ్రీవాసవీ ఆర్యవైశ్య కన్యకాపరమేశ్వరి అమ్మవారి కల్యాణ మండపంలో వినాయక లడ్డును రూ.75వేలకు కర్లపాలెం మెడికల్‌షాపు నిర్వహకులు బొమ్మిశెట్టి మదన్‌మోహన రావు దంపతులు దక్కించుకున్నారు. కర్లపాలెం పంచాయతీ గౌడపాలెంలో వినాయక విగ్రహానికి మహిళలు పరిమి శ్రీమన్నారాయణ పురోహితుల ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు.

● కర్లపాలెం మండలంలోని పెదపులుగువారిపాలెంలో వినాయక విగ్రహం వద్ద లడ్డును పులుగువెంకటరెడ్డి రూ.14వేలుకు దక్కించుకున్నారు.



వేమూరులో గణపతి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనందబాబు



రేపల్లె: ఏఎస్‌పీ హిల్స్‌లో వినాయకచవితి మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్

● పిట్టలవానిపాలెం మండలంలోని ఖాజీపాలెం ఛత్రపతి శివాజీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాధుని నిమజ్జనోత్సవం నిర్వహించారు. స్వామి లడ్డును ఖాజీపాలెం గ్రామానికి చెందిన ఆలమూరు త్రినాథ్ రూ.16,100కు దక్కించుకున్నారు. మండలంలోని కొత్తపాలెంలో శ్రీవరసిద్ధి వినాయకుడి ఆలయం లో వినాయక విగ్రహానికి బీజేపీ మండల అధ్యక్షులు అక్కల రామిరెడ్డి తన కుటుంబసమేతంగా ప్రత్యేక పూజలు చేశారు.

● బాపట్ల పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో వినాయకుని లడ్లకు వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటలో మొదటి లడ్డును కనకమహాలక్ష్మీ రెడీమెడ్ అధినేత తడికమలా వెంకట్ రూ.45వేలకు, రెండోది ఆర్యవైశ్యం సంఘం అధ్యక్షులు కొత్తమాసు సత్యనారాయణ రూ.35వేలకు, మూడోది కృష్ణకిషోర్ రూ.11వేలకు దక్కించుకున్నారు.

శ్రీమద్భాగవత సప్తాహ మహోత్సవాలు ప్రారంభం

కొల్లూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): 109 వ శ్రీమద్భాగవత సప్తాహజ్ఞాన యజ్ఞ మహోత్సవాలు సోమవారం నుంచి వారం రోజులపాటు జరగనున్నాయి. కొల్లూరులోని గోవర్ధన మండపంలో భాగవత సప్తహ మహోత్సవాలను పురస్కరించుకుని ఒకటో తేదీ నుంచి ఏడో తేదీ వరకు జరిగే కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం తంగిరాల రాజేంద్రప్రసాద్ భాగవత పారాయణ మహత్యం ప్రవచించారు. సోమవారం ఉదయం 8 గంటలకు భాగవత గ్రంథాన్ని పురవీధుల్లో ఊరేగించి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు శంకర సేవాసమితి కార్యదర్శి కల్లూరి వెంకటసూర్యనారాయణమూర్తితెలిపారు.

ఆటో ఢీ.. వ్యక్తి మృతి

కర్లపాలెం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లమోతువారిపాలెం సమీపంలో జాతీయ రహదారి వెంట హనిటీ స్టాల్ వద్ద శనివారం జరిగిన రోడ్డుప్రమాదంలో దొప్పుడి చంద్రపాల్ అనే వ్యక్తి మృతి చెందాడని ఎస్సై రవీంద్ర తెలిపారు. బాపట్ల నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న చంద్రపాల్‌ను వెనుక నుంచి వచ్చిన ట్రక్కు ఆటో ఢీకొనటంతో చంద్రపాల్‌కు తీవ్రగాయాలయ్యాయి. చంద్రపాల్‌ను మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా మృతి చెందాడని ఎస్సై తెలిపారు. క్షతగాత్రుడిని శవపంచనామ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. ఆటోను,ద్విచక్ర వాహన్ని కర్లపాలెం పోలీసుస్టేషన్‌కు తరలించామన్నారు.

డీజేలు ఉపయోగించరాదు

● చందోలు ఎస్‌ఐ వెంకటశివకుమార్

పిట్టలవానిపాలెం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగ సందర్భంగా మండపాల వద్ద గ్రామకమిటీ నిర్వహకులు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల నిమజ్జన సమయంలో డీజే సౌండ్ సిస్టమ్‌లు ఉపయోగించరాదని చందోలు ఎస్‌ఐ ఎం వెంకటశివకుమార్ తెలిపారు. ఆదివారం చందోలు పోలీసుస్టేషన్ నందు వినాయక విగ్రహకమిటీ నిర్వాహకులకు ఎస్‌ఐ శివకుమార్ పలుసూచనలు చేశారు. వినాయక నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో ప్రజలకు, భక్తులకు ఇబ్బందులు లేకుండా నిర్వహించుకోవాలని ఆయన తెలిపారు.

పిచ్చిమొక్కలు, వ్యర్థాలతో ప్రధాన రహదారి

● కన్నెత్తి చూడని అధికారులు.. ● ఇబ్బంది పడుతున్న ప్రజలు



మెటల్ రోడ్డు పక్కన పెరుగుతున్న పిచ్చిమొక్కలు, డ్రెయిన్‌లో నిలిచిన మురుగు



రోడ్డుపై వేసిన చెత్తాచెదారం

బాపట్ల, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 11వవార్డులో ప్రజలు సమస్యలతో సతమతమౌతున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ లేక వర్షం వస్తే సిమెంట్ రోడ్లన్నీ కాల్వలుగా ప్రవహిస్తాయి. కర్లపాలెం బీటీ రోడ్డు నుంచి హైవే బైపాస్‌ను కలుపుతూ గత ప్రభుత్వ హయాంలో విస్తరించి నిర్మించిన 40అడుగుల రోడ్డు అభివృద్ధికి నోచుకోలేదు. అప్పట్లో కేవలం మెటల్ వేసి మధ్యలో డివైడర్ నిర్మించి రెండువైపులా డ్రెయినేజి నిర్మించి వదిలేశారు. డివైడర్ మధ్య, రెండుపక్కల పిచ్చిమొక్కలు పెరిగాయి. అదేవిధంగా రెండువైపుల ఉన్న డ్రెయినేజిలలో మురుగుబయటకెళ్లే పరిస్థితి లేక నీరు నిలిచి దోమలు వ్యాపించి ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈ ప్రధానరహదారి ప్యాడిసన్‌పేట జగనన్నకాలనీకి, సూర్యలంక రోడ్డుకెళ్లేందుకు, విద్యానగర్ ప్రజలకు ఎంతోఉపయోగంగా ఉంటుంది. రోడ్డుపక్కనే ఐటీఐ కళాశాల, ఇంగ్లీష్ మీడియం స్కూల్ కూడా ఉన్నాయి. నిత్యం రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రోడ్డును అభివృద్ధి చేయాలనే ఆలోచన పాలకులు, అధికారులకు ఏమాత్రం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. బావుడా ఛైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు నివాసానికి వెళ్లే ఈరోడ్డు అభివృద్ధి విషయంలో దృష్టి సారించకపోవటం వల్ల ఆయనను కూడా స్థానికులు విమర్శిస్తున్నారు. ఇదిలా ఉండగా రోడ్డుపక్కనే మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వి మెటల్ గుట్టలుగా రోడ్డుపై వేసి వదిలేశారు. గుంతలు పూడ్చకపోవటం వల్ల నాటిన మొక్కలు ఎండిపోతున్నాయి. రాత్రి 6 దాటితే ఈరోడ్డుపై రెండు నిమిషాలు నిలబడలేని పరిస్థితి. ఓవైపు దుర్వాసన మరోవైపు దోమల విజృంభణతో తట్టుకోలేకపోతున్నారు. మున్సిపల్ అధికారులు కన్నెత్తి చూడటంలేదు. ఈ వార్డులో పర్యటించి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలని ప్రజలు కోరుతున్నారు.



డివైడర్ మధ్య, పక్కన మొలిచిన జిల్లేడు, పిచ్చిమొక్కలు



మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వి రోడ్డుపై పోసిన మెటల్ గుట్టలు

ప్రతి ఒక్కరూ దైవచింతనతో మెలగాలి

రేపల్లె, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ దైవచింతనతో మెలగితే ఆ కుటుంబా లు సుఖసంతోషాలతో ఉంటాయని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. ఆదివారం ఉప్పూడి రోడ్డులోని ఏఎస్‌పీ హిల్స్‌లో వినాయక మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందలాది మందికి అన్న సంతర్పణ చేశారు. అనంతరం లడ్డుపాట నిర్వహించగా బేతపూడికి చెందిన రాఘవ రూ.70వేలకు లడ్డును దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో కేసన రామకృష్ణ, పంతానినరేష్, సాయికుమార్, కొపనాతిరాజశేఖర్, బొర్రాసూర్యరాజు, గుర్రంమురహరి, మాగంటి సాంబశివరావు, డి.వెంకటేశ్వరరావు, పిచ్చియ్య కమిటిసభ్యులు పాల్గొన్నారు.

గణపతి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

వేమూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : కమ్మజన సేవా సమితి ఆధ్వర్యంలో వేమూరు ఎన్టీఆర్ పురవేదిక వద్ద నిర్వహిస్తున్న వార్షిక గణపతి ఉత్సవ పూజా కైంకర్యాల్లో ఆదివారం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఆనందబాబును సత్కరించారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ విజయబాబు, గాజుల వెంకటసుబ్బయ్య, ఉసా రాజేష్, యలవర్తి సురేంద్ర, కోగంటి రాజేష్, గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుశాఖకు సేవలందించటం అభినందనీయం

● ఎస్పీ తుషార్ డూడీ



ఉద్యోగవిరమణ పొందిన పోలీసు సిబ్బందిని సన్మానిస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్ల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : సుదీర్ఘ కాలంపాటు పోలీసుశాఖకు సేవలందించటం అభినందనీయమని ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. ఉద్యోగవిరమణ పొందిన పోలీసు సిబ్బందిని ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో సిబ్బందితో కలిసి ఎస్పీ ఘనంగా సత్కరించారు. జిల్లా పీజీఆర్ఎస్ సెల్‌లో ఎస్‌ఐగా పనిచేసిన బీవీ డేవిడ్, స్పెషల్ బ్రాంచ్ విభాగంలో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించిన ఎన్ రామకోటేశ్వరరావులు ఉద్యోగ విరమణ పొందారు. కుటుంబసభ్యుల సమక్షంలో వారిని సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఏఆర్‌డీఎస్పీ పి.విజయసారథి, వెల్ఫేర్ ఆర్‌ఐ మౌలుద్దీన్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది ఉద్యోగవిరమణ పొందినవారు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీబగళాముఖి అమ్మవారికి ప్రత్యేక పూజలు



నిజపాద అలంకరణలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారు

పిట్టలవానిపాలెం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారికి భాద్రపద మాసంలో ఆదివారం సందర్భంగా భక్తులకు ప్రత్యేకంగా దర్శనమిచ్చారు. ప్రజలు పాడిపంటలతో సుఖసంతోషాలతో అనుగ్రహించే నిజపాద అలంకరణలో శ్రీబగళాముఖి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారని ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. భక్తులు మొక్కుబడులు తీర్చుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ సీనియర్ సహాయకులు నాగుల శ్రీనివాసరావు, కొండవీటి శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



వినాయక కమిటీ నిర్వాహకులతో మాట్లాడుతున్న చందోలు ఎస్‌ఐ ఎం.వెంకటశివకుమార్

కర్లపాలెంలో పట్టపగలు షాపులో చోరీ

● పోలీసులకు సవాల్ విసిరిన దొంగ



షాపులో దొంగతనం చేస్తున్న వ్యక్తి (సీసీ పుటేజి)

కర్లపాలెం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం సెంటర్లో ఉన్న ఓదుకాణంలో శనివారం పట్ట పగలు దొంగతనానికి పాల్పడ్డాడు. కర్లపాలెంలోని మలిశెట్టి రవికుమార్ క్రూల్‌డ్రింక్స్ షాపులో ఒక వ్యక్తి నిర్వాహకుడిని క్రూల్‌డ్రింక్ తీసుకొనిరమ్మని చెప్పి మాటలలో మభ్యపెట్టి షాపులోని గల్లపెట్టలో ఉన్న రూ.35వేల నగదును దొంగిలించాడు. గల్లపెట్టెలో నగదు మాయం అవ్వటంతో షాపు యజమాని మలిశెట్టి రవికుమార్ సీసీపుటేజ్‌ను కర్లపాలెం పోలీసులకు అందజేసి ఫిర్యాదు చేశాడు. రవికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రవీంద్ర తెలిపారు. వారం రోజుల క్రితం ఇంటిముందు పార్క్ చేసిన పల్సర్ వాహనం చోరీకి గురవ్వటం ఇలా వరుసగా దొంగతనాలు జరగటంపై ప్రజానీకం ఆందోళన చెందుతున్నారు. పోలీసులు అప్రమత్తమై నిఘా పెంచి దొంగతనాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ప్రజానీకం కోరుతున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

కొల్లూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో వృద్ధుడు గాయపడి చికిత్సపొందుతూ మృతిచెందినట్లు ఎస్‌ఐ జానకి అమరవర్ధన్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం మండలంలోని బొద్దులూరుపాడులో కిరాణా దుకాణం నిర్వహిస్తున్న కొల్లూరు వెంకటనరసయ్య (68) దుకాణంలో సరుకులు కొనేందుకు తన టీవీఎస్ ఎక్స్‌ఎల్(ఏపీ3ఏయూ4173) కొల్లూరు వచ్చి సరుకులు తీసుకుని గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న తన కుమార్తె ఇంటికి వెళుతుండగా వేమూరు వైపు నుంచి వస్తున్న ఏపీ40ఎం8549 ద్విచక్ర వాహనం ఢీకొనడంతో వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వృద్ధుడిని తెనాలిలోని ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లగా అక్కడ వైద్యుల సూచనలు మేరకు గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి కుమార్తె మోపిదేవి చంద్రిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.



వెంకటనరసయ్య (ఫైల్‌ఫొటో)

ఆరుద్ర, రాజశ్రీకి సాహితీభారతి ఘన నివాళి



ఆరుద్ర, రాజశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న రావూరి నరసింహవర్మ ఆదంషఫి తదితరులు

బాపట్ల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యాభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన త్యాగమూర్తులలో ఆరుద్ర ఒకరని తెలుగులో అనేక అద్భుతమైన గీతాలు రచించారని సాహితీ భారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు.. ఆదివారం బాపట్ల సాహితీ భారతి ఆధ్వర్యంలో ఆరుద్ర, రాజశ్రీ (ఇం దుకూరి రామకృష్ణంరాజు) జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సాహితి కోశాధికారి ఆదంషఫి, ఉపాధ్యక్షులు మర్రి మాల్యాద్రిరావు, కామరాజు కాళీదాసు, బొడ్డుపల్లి శ్రీరామ చంద్రమూర్తి, ప్రజాకవి శ్రీనివాస్ తదితరులు ఆరుద్ర, రాజశ్రీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అండర్-17 ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో బాపట్ల విద్యార్థుల ప్రతిభ



అండర్ -17 ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలో ప్రతిభ చాటిన విద్యార్థులు

బాపట్ల, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో భీమవరంలో జరిగిన అండర్-17 చాంపియన్‌షిప్ పోటీలో బాపట్ల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. బాపట్లలోని ఇండోర్ స్టేడియంలో ఖేలోఇండియా సెంటర్ నందు ఫెన్సింగ్ శిక్షణ పొందుతున్న ఎస్.కిరణేశ్వరరెడ్డి గోల్డ్‌మెడల్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అదేవిధంగా గ్రూపు విభాగంలో ఎ.కార్తీకమిత్ర గోల్డ్‌మెడల్, ఎం.కార్తీకేయ రజితపతకం, సబ్రే విభాగంలో కె.హర్షిత, వై.సలోమి రజిత పతకాలు సాధించారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్‌స్పోర్ట్స్ అథారిటీ అధికారి కె.పాల్‌కుమార్, కోచ్ ఆర్ నాగచిరంజీవిలు క్రీడాకారులను అభినందించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

● 11 మందికి అందజేసిన ఎమ్మెల్యే



లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, ఆగ స్టు 31 (ఆంధ్రజ్యో తి): వేమూరు, కొల్లూరు మండలాల పరిధిలో ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొం ది ప్రభుత్వం ద్వా రా ముఖ్యమంత్రి సహాయ నిధి చె క్కులు మంజూరు చేసిన 11 మంది లబ్ధిదారులకు ఆ దివారం ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం రూ.6లక్షల 79 వేల 476 మంజూరయ్యాయి. పోతుమర్రు గ్రామానికి చెందిన పులివర్తి విజయకాంత్‌కు రూ.1,56,652, కీర్తిసాయికుమారికి రూ.20,524, పెరవలి గ్రామానికి చెందిన శ్రీరామకుమారికి రూ.90 వేలు, చెన్నుపల్లి రాజేష్‌కు రూ.31, 346, పెరవలిపాలెంనకు చెందిన గద్దం సాంబశివరావుకు రూ.70 వేలు, ఉసా దేవికకు రూ.25,656, కాకర్లమూడికి చెందిన బొల్లిముంత అంకమ్మరావుకు రూ.47,016, బెల్లంకొండ తిరుపతిరావుకు రూ.55 వేలు, కొల్లూరు మండలం చిలుమూరుకు చెందిన కొడాలి వెంకటరాఘవయ్యకు రూ.1,29,971, గాజుల కృష్ణకుమారికి రూ.32,787, రామకోటేశ్వరరావుకు రూ.20,524లను చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

మురళీమోహన్‌కు తెలుగు భాషా సేవా పురస్కారం

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడు గుర్రం మురళీమోహన్ తెలుగుభాషా సేవా పురస్కారం ఆదివారం అందుకున్నారు. మండలపరిధిలోని వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఆయనకు పల్నాడు జిల్లా నరసరావుపేట శ్రీశ్రీ కళావేదిక తెలుగుభాష దినోత్సవ సంబరాల్లో కళావేదిక మేనేజింగ్ డైరెక్టర్ కె. ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు ఈ శ్వరి భూషణం చే తుల మీదుగా సే వా పురస్కారం అందుకున్నారు. కార్యక్రమంలో క ళావేదిక సభ్యులు రామారావు, హరిప్రసాద్, సుబ్రహ్మ ణ్యం తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడు మురళీమోహన్‌ను సన్మానిస్తున్న శ్రీశ్రీ కళావేదిక ప్రతినిధులు

నగరవనంలో మహిళా సమైక్య సమావేశం

బాపట్ల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సూర్యలంకరోడ్డులోని జీడిమామిడితోటల్లో ఏర్పాటు చేసిన నగరం వనం నందు మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో మహిళా సమైక్య సమావేశం ఆదివారం జరిగింది. సంస్థ ఛైర్మన్ డాక్టర్ బి.శరత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉదయం యోగాతో ప్రారంభించి సాంస్కృతిక కార్యక్రమాలతో ముగించారు. ఈ సందర్భంగా సంస్థ ఛైర్మన్ మాట్లాడుతూ ప్రతిరోజు యోగా చేసి సంపూర్ణ ఆరోగ్యం పొందాలని కోరారు. సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు పంగులూరి హరిప్రసాద్, గురజాల శ్రీనివాసరావు ప్రసంగించారు. అనంతరం మహిళా సమైక్య అధ్యక్షురాలు కోలా పద్మజ మాట్లాడుతూ మహిళలు స్వయంగా, అభివృద్ధికి సంస్థ ద్వారా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రతిమహిళ సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షులు వంకాయలపాటి హరిబాబు, కోశాధికారి సీహెచ్ కేశవులు, జాయింట్ సెక్రటరి సూరిబాబు, విశ్రాంత అధ్యాపకులు జి.శాంతారాం, కరుణ రవీంద్రబాబు, తోటరామాంజనేయులు, మంజులత, శ్రీలక్ష్మీ, అనంతకుమారి తదితరులు పాల్గొన్నారు.